# వివాదాస్పద లేఅవుట్ రద్దుకు సిఫార్సు!




- ఇసితాబాద్ వెంచర్లో క్షేత్ర పరిశీలనలో బట్టబయలైన డొల్లతనం
- 'రీవోక్' చేయాలని డీపీఓకు నివేదిక
- ముగిసిన అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులు జరగలేదని అధికారికంగా నిర్ధారణ
- లేఅవుట్ అనుమతులను రద్దు చేయాలని అధికారి డీఎల్పీవో అనిత సిఫార్సు
- ఎంపీడీవో, సెక్రెటరీతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన
- హాజరైన సర్పంచ్, వెంచర్ యాజమాని
- రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్, విద్యుత్ దీపాలు లేకుండానే ప్లాట్ల వ్యాపారం
- అనుమతులు లేకుండా నిర్మించిన కంపౌండ్ వాల్
- పంచాయతీకి చెల్లించాల్సిన డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల ఎగవేత
- రికార్డులు, నోటీసులు పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్న డీపీఓ
- అక్రమంగా విడుదలైన మార్టిగేజ్ ప్లాట్ల భవిష్యత్తుపై తేలాల్సిన లెక్కలు
- నిబంధనలు ఉల్లంఘించిన రియల్టర్లు, సహకరించిన అధికారుల్లో గుబులు

**సదాశివపేట, సిరి న్యూస్: అనుమతులు లేకుండ అడ్డగోలుగా వెలిసిన వెంచర్ పై సిరి న్యూస్ రాసిన కథనాలు అధికారులను కదిలించాయి. సంగారెడ్డి జిల్లా ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివాదాస్పద లేఅవుట్‌పై అధికారులు చేపట్టిన సమగ్ర క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. లేఅవుట్ అనుమతుల నిబంధనల ప్రకారం క్షేత్రంలో చేపట్టాల్సిన కనీస మౌలిక అభివృద్ధి పనులేవీ జరగలేదని దర్యాప్తు అధికారి డీఎల్పీవో అనిత అధికారికంగా గుర్తించారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్లాట్ల విక్రయాలు సాగిస్తున్న సదరు లేఅవుట్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారికి పూర్తిస్థాయి నివేదికను సమర్పించారు. స్థలాన్ని స్వయంగా పరిశీలించాం.. ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లుగానే అక్కడ అభివృద్ధి పనులు శూన్యం. అందుకే అనుమతులు రద్దు చేయాలని డీపీఓకు నివేదించాం అని పరిశీలన అధికారి స్పష్టం చేశారు.**

### కాగితాలకే పరిమితమైన వసతులు

పంచాయతీరాజ్, డీటీసీపీ నిబంధనల ప్రకారం లే అవుట్‌లో అంతర్గత బీటీ లేదా సీసీ రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతి ప్లాట్‌కు రక్షిత మంచినీటి కొళాయిలు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. గతంలో జరిగిన పరిశీలనల సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని వెంచర్ నిర్వాహకులు లిఖితపూర్వకంగా తెలిపినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదని విచారణలో తేలింది. రాళ్లు పాతడం మినహా ప్రజా వినియోగానికి అవసరమైన శాశ్వత వసతులు కల్పించకుండానే లేఅవుట్‌ను కొనసాగిస్తున్నట్లు అధికారులు తమ నివేదికలో స్పష్టంగా పొందుపరిచారు.

### అనుమతులు లేని కంపౌండ్ వాల్..

లేఅవుట్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ కంపౌండ్ వాల్ అంశాన్ని సైతం అధికారి తన పరిశీలన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత తనిఖీల సందర్భంగానే ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ నిర్వాహకులు లెక్కచేయలేదని తేలింది. దీనితో పాటు గ్రామ పంచాయతీ ఖజానాకు చట్టబద్ధంగా జమ కావాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలు, బెటర్‌మెంట్ ఫీజులను కూడా పూర్తిగా చెల్లించలేదన్న అంశాన్ని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. పంచాయతీ ఆదాయానికి గండికొడుతూ, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన తీరును నివేదిక ఎత్తిచూపింది.

### 'రీవోక్' అంటే అనుమతి రదే.. తుది నిర్ణయం డీపీఓ చేతుల్లో..

అధికారిక పరిభాషలో రీవోక్ అంటే లేఅవుట్‌కు ఇచ్చిన అనుమతులను పూర్తిగా రద్దు చేయడమేనని అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 8 మరియు 67(జె) నిబంధనల ప్రకారం నిబంధనలు పాటించని లేఅవుట్లను రద్దు చేసే పూర్తి అధికారం జిల్లా పంచాయతీ అధికారికి ఉంటుంది. క్షేత్రస్థాయి నివేదిక, గతంలో జారీ చేసిన నోటీసులు, పంచాయతీ రికార్డులు, బ్యాంక్ చలానాలను డీపీఓ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చట్టపరమైన ఉత్తర్వులు జారీ చేయనున్నారు.



### మార్టిగేజ్ ప్లాట్ల విడుదలపైనా తేలాల్సిన లెక్కలు

ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు, నోటీసులు, క్షేత్ర పరిశీలనలతో తీవ్ర దుమారం రేపిన ఈ వ్యవహారంలో.. తాజాగా లేఅవుట్ రద్దుకు సిఫార్సు చేస్తూ అధికారిక నివేదిక వెళ్లడం పెను సంచలనంగా మారింది. డీపీఓ తుది ఉత్తర్వులు వెలువడిన తర్వాత లేఅవుట్ పూర్తి భవిష్యత్తు తేలనుంది. అభివృద్ధి చేయకుండానే అక్రమంగా విడుదలైన మార్టేజ్ ప్లాట్లను పంచాయతీ తిరిగి స్వాధీనం చేసుకుంటుందా? ప్రభుత్వ ఆదాయాన్ని ఎగ్గొట్టినందుకు రియల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా? అన్నది ఇప్పుడు ఇసితాబాద్ పరిసరాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.



